క్లుప్తంగా

అ'పూర్వ' కలయిక



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో తోటి మిత్రులను సత్కరిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1954 నుంచి 1964 మధ్య చదువుకున్న పూర్వవిద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సుమారు 58 నుంచి 60 సంవత్సరాల తరువాత కలుసుకున్న స్నేహితులు కుశల ప్రశ్నలు వేసుకుని, నాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. వీరంతా వివిధ వృత్తుల్లో ఉద్యోగ విరమణ చేసి అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇన్నేళ్లకు ఈ అపూర్వ కలయికకు కృషిచేసిన మిత్రులను శాలువా కప్పి సన్మానించారు. రెండు రోజులపాటు ఈ ప్రాంతంలో గడిపేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ నాటి మిత్రులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ధోరణిలో ప్రసంగించారు. అనంతరం ఎస్సైను శాలువాతో సత్కరించారు.

విద్యార్థినికి ప్రోత్సాహక నగదు బహుమతి



ఉత్తమ విద్యార్థిని మానసను సత్కరిస్తున్న ఎంఈవో ఎస్.స్వరూప్, పూర్వవిద్యార్థులు

పోలవరం రూరల్ : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు (578) సాధించిన విద్యార్థిని మానసను పూర్వ విద్యార్థులు సన్మానించి, సత్కరించారు. ఎంఈవో ఎస్.స్వరూప్ ఆధ్వర్యంలో 1984–85 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మానసకు రూ.2116 నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అలాగే వారి తల్లితండ్రులను కూడా సత్కరించారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు డైరీలను అందజేశారు. పాఠశాలకు అవసరమైన స్టడీ సర్టిఫికెట్‌లు, ప్రోగ్రెస్ కార్డులు, ఇతర మెటీరియల్‌ను కూడా పాఠశాలకు అందించినట్లు పేర్కొన్నారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ కార్యకర్తల సమావేశం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో మహాజన సోషలిస్ట్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బయ్యారపు రాజేశ్వరరావు, విస్సంపల్లి సిద్దు మాదిగ హాజరై మాట్లాడారు. మహాజననేత మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు మహాజన సోషలిస్టు పార్టీని గ్రామస్థాయి నుంచి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులుగా నాగులగూడెం గ్రామానికి చెందిన బొడ్డపాటి పండు మాదిగను జంగారెడ్డిగూడెంకు చెందిన మోటుమర్రు జగన్ రజాక్‌ను నియమించారు.

మదనగోపాలస్వామి ఆలయ నిర్మాణం వేగవంతం



తుదిమెరుగులు దిద్దుకుంటున్న మదన గోపాలస్వామి ఆలయ నిర్మాణం

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అదేవిధంగా టీటీడీ, ప్రజాప్రతినిధుల కృషితో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన మదన గోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ.కోటి 30 లక్షల వ్యయంతో స్వామివారి ఆలయం నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి ఆరో తేదీ వరకు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి పేర్కొన్నారు. ధ్వజస్తంభం ఇత్తడి తాపడానికి భక్తులు తమ ఇళ్లలోని ఇత్తడి అందజేయవచ్చునని తెలిపారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములయ్యేవారు విరాళాలను అందజేయడానికి నేరుగా కార్యనిర్వాహణాధికారి 93472 14547, 93468 11693 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ శనివారం రాత్రి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ఇప్పలపాడులో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెంలో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం : సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బుట్టాయగూడెం సచివాలయం–2 పరిధిలోగల ఇప్పలపాడు, తాడితోట గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారుల బెడద లేకుండా నేరుగా పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా తమ ప్రభుత్వం పథకాలను మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందడం ద్వారా పేదలు ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. టీడీపీ పాలనా సమయంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పినవారికే పథకాలు అందేవని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు నేరుగా పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా నెరవేర్చారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలపరిచి ఆశీర్వదించాలని బాలరాజు ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతిరమణ, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, పొడియం లక్ష్మి, మడకం రామలక్ష్మి, పెడకం విజయలక్ష్మి, జోడే సత్యదుర్గాప్రసాద్, ఎంపీటీసీ మొడియం వెంకమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ శారా శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారం వెంకటరమణ, యాంద్ర రవి, తెల్లం సింహాచలం, పార్టీ శ్రేణులు అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

జంగారెడ్డిగూడెం : ప్రజలకు ఆర్థిక వనరులు కల్పిస్తూ, ఇటు ప్రజల ఆదాయాన్ని, అటు రాష్ట్రాభివృద్ధిని పెంపొందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యల గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పేదరికం వ్యక్తిగత అభివృద్ధికి అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ప్రజలకు ఆర్థిక వనరులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక వనరులతో ఉపాధి మార్గాలు సృష్టించుకుని పేదరికాన్ని జయించేందుకు అవకాశం కలుగుతుందని, వ్యక్తిగత ఆదాయం, కుటుంబ ఆదాయాన్ని పెంచుతుందని, తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి దోహదపడుతుందన్నారు. దీంతో మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టి కలిగిన వ్యక్తి అని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారన్నారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా ఎలా లబ్ధి చేకూరిందో ప్రజల నుంచి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉన్నారా, వారికి ఇప్పటి వరకు ఎందుకు లబ్ధి చేకూరలేదో తెలుసుకుని, వారికి కూడా ప్రభుత్వ పథకాలను అందించేలా అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, పార్టీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, మేడవరపు విద్యాసాగర్, గూడపాటి రాధాకృష్ణ, పోలీసు, మున్సిపల్, మెప్మా, హౌసింగ్, ఎలక్ట్రికల్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిథి ఫిజికల్ డైరెక్టర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫిజికల్ డైరెక్టర్‌గా(పీడీ) పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ మాస్టర్ డిగ్రీ కోర్సులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ సర్టిఫికెట్లు జిరాక్స్‌తో దరఖాస్తులను కళాశాల నందు సమర్పించాలన్నారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు అర్హులైన అభ్యర్థులకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



పాల ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం టి.అనిల్‌క్రాంతి

పోలవరం రూరల్ : మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాబార్డు డీడీఎం టి.అనిల్‌క్రాంతి పేర్కొన్నారు. శనివారం గూటాల గ్రామంలో నాబార్డు సార్డ్ ఎన్‌జీవో సంయుక్తంగా 90మంది డ్వాక్రా మహిళలకు జీవనోపాధి పెంపొందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధానంగా డ్వాక్రా మహిళలకు ఆర్థిక వనరుల పెంపుదల కోసం, పశుపోషణ, పాల ఉత్పత్తుల ద్వారా ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమం ద్వారా గూటాల, పాతపట్టిసీమ, కొత్తపట్టిసీమ గ్రామాల్లోని వివిధ డ్వాక్రా సంఘ మహిళలకు శిక్షణ ఇప్పించి తరువాత వారి గ్రూపుల ద్వారా రుణాలు పొందిన చిన్న చిన్న యూనిట్లను ప్రారంభించడం జరుగుతుందని డీడీఎం టి.అనిల్‌క్రాంతి తెలిపారు. ఈ శిక్షణ కాలంలో మహిళలకు అయ్యే ఖర్చు నాబార్డు భరిస్తుందన్నారు. మహిళలు పాలతో తయారు చేసే వివిధ ఉత్పత్తులు మార్కెట్ చేయడానికి సార్డ్ ఎన్‌జీవో సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తన భర్త తనను కాపురానికి తీసుకువెళ్లడం లేదని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం పిడుగురాళ్లకు చెందిన కంతేటి వెంకట చలపతికి, జంగారెడ్డిగూడెంకు చెందిన వందనకు 2022 ఫిబ్రవరి 11న వివాహమైంది. అనంతరం పిడుగురాళ్లకు భర్తతో కాపురానికి వెళ్లింది. అయితే అదే సంవత్సరం మార్చి 4వ తేదీన వెంకట చలపతి జంగారెడ్డిగూడెం బస్టాండ్‌లో ఆమెను వదిలి వెళ్లిపోయాడు. కాపురానికి తీసుకువెళ్లమని అనేక పర్యాయాలు భర్తను కోరినా స్పందించలేదు. తనకు పిచ్చి ఉందని, మానసిక సమస్యలు ఉన్నాయని పేర్కొంటూ తనను దూరంగా ఉంచుతున్నారని, దీనికి తన భర్తతో పాటు ఆడపడుచులు, అత్తగారు సహకరిస్తున్నారని వందన ఫిర్యాదులో పేర్కొంది. పెళ్లి సమయంలో తన తల్లిదండ్రులు కట్నకానుకల కింద రూ.2లక్షల వరకు తన భర్తకు ముట్టజెప్పారన్నారు. వివాహం చేసుకుని నెల రోజుల్లోనే తనను వదిలించుకోవాలనే ఉద్దేశంతో బస్టాండ్‌లో వదిలివేయడమే కాక, తనను మానసికంగా వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచులపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేసింది.

సచివాలయ సేవలను ప్రజలకు చేరువచేయాలి

సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే ఎలీజా ఆదేశం



సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన శ్రీనివాసరావు, దుర్గారావులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

చింతలపూడి : సచివాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో సచివాలయాల కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆదేశించారు. చింతలపూడి మండల, నగర పంచాయతీల సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నిమ్మగడ్డ దుర్గారావులను ఎమ్మెల్యే అభినందించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన సచివాలయ కన్వీనర్లతో ఆయన మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు చాలా ముఖ్యమైనవని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి, మున్సిపాలిటీలకు కన్వీనర్‌లను నియమించామని సచివాలయాల కన్వీనర్లను సమన్వయం చేసుకుని అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువ చేయాలని కోరారు. రాష్ట్ర సచివాలయాల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కన్వీనర్లు పని చేయాలని అన్నారు. ప్రతీ రోజూ సచివాలయాలపై పచ్చ మీడియ, ప్రతిపక్షాలు బురద చల్లుతున్నాయని, విమర్శలను తిప్పికొట్టి సచివాలయాల ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలు వివరించాలని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదే



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, జెడ్పీ చైర్మన్ కవురు, ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో సుమారు రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అలాగే రూ. 21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వసేవలను సక్రమంగా అందేలా కృషి చేస్తుందని అన్నారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్ర వల్ల ఒరిగేది ఏమీలేదని అన్నారు. ఎవరు ఎన్ని వేషాలు వేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయంతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, 7 మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినికి తహసీల్దార్ ప్రశంస



తహసీల్దార్‌కు తాను రూపకల్పన చేసిన ప్రాజెక్టు వివరాలను అందజేస్తున్న విద్యార్థిని గాయత్రీశ్వరి

కొయ్యలగూడెం : విద్యార్థులలో నిక్షిప్తమై ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకత శక్తిని వెలికితీసేందుకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తహసీల్దార్ పాశం నాగమణి పేర్కొన్నారు. రాజమండ్రిలో 9వ తరగతి చదువుతున్న రాజవరం గ్రామానికి చెందిన దాసరి గాయత్రీశ్వరి సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఇంటి వద్ద రూపొందించిన ప్రాజెక్టు వర్క్‌ను చూసి ఆమె అభినందించారు. శనివారం కార్యాలయంలో తహసిల్దార్‌ను విద్యార్థిని కలిసి తన ప్రాజెక్టును వివరించారు. భారతదేశం అందజేసే భారతరత్న మొదలుకొని అత్యున్నత పురస్కారాలు అయిన పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ, పద్మ, అదేవిధంగా దేశ భద్రతకు రక్షణకు సంబంధించిన మహావీర్ చక్ర, పరమవీరచక్ర, కీర్తి చక్ర అవార్డులు గురించి ప్రాజెక్టులో విద్యార్థిని పొందుపరిచారు. ఈ అవార్డులు ప్రదానం చేసే విధానం తహసీల్దార్ తెలుసుకొని ప్రాజెక్టు రూపకల్పన కాపీలను ప్రభుత్వ పాఠశాలలో కూడా అందజేయాలని ఇతర విద్యార్థులలో స్ఫూర్తినింపాలని గాయత్రీ ఈశ్వరికి సూచించారు.

ప్రత్యేక పంచాయతీ కోసం వినతి



ప్రత్యేక పంచాయతీ కోసం ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : టి.నరసాపురం పంచాయతీలోని ఎర్రకాలువ అవతల వైపు ఉన్న ఆరుగ్రామాలను కలిపి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజును దుద్దుకూరులో ఆయన నివాసం వద్ద శనివారం కలిసి అర్జా సాగర్, భూక్యావేణుగోపాల్ తదితరులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణాపురం, రుద్రకోటరాజుగూడెం, పుట్రేపు, ప్రకాష్‌నగర్, కాపుగూడెం, రాజులగూడెంలను కలిపి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు ద్వారా ఆయా గ్రామాలు పురోభివృద్ధి చెందుతాయని వారు అభిప్రాయ పడ్డారు. అనంతరం ఎంపీపీ దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావుకు కూడా వినతిపత్రం అందజేశారు. అలాగే పుట్రేపు, బండివారిగూడెం రోడ్డును తక్షణమే అభివృద్ధి చేయాలని, కృష్ణాపురం గట్టుపై ఉన్న ఆక్రమణలు తొలగించి నిరుపేదలకు న్యాయం చేయాలని, మంచినీటి, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరినట్లు, దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు.

రోటరీ సూపర్ ఎయిట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ

జంగారెడ్డిగూడెం : మైదానంలో ఆడే క్రీడలో ఆనందం, ఆహ్లాదం, తృప్తి ఉంటుందని, ముఖ్యంగా గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి అలవడుతుందని, రోటరీక్లబ్ అధ్యక్షుడు దాకారపు కృష్ణ అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రోటరీ సూపర్ ఎయిట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తొలి పోటీ త్రివేణీ కళాశాల – ప్రిన్స్ లెవెన్ మధ్య జరిగింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు శ్రీనూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు), దాకారపు కృష్ణతో పాటు ప్రముఖులు బాట్ పట్టి క్రికెట్ ఆడి స్ఫూర్తి నింపారు. రోటరీ కార్యదర్శి వూడా రాంగోపాల్(గోపీ) మాట్లాడుతూ 22వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, 26న స్వచ్ఛంద సంస్థల మధ్య ప్రత్యేక స్నేహపూర్వక పోటీ నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి



డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చింతలపూడి : వాహన యజమానులు, ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎస్సై డి.హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎస్సై హరికృష్ణ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణీకులను అనుమతించరాదన్నారు. ఆటోలు నడిపే సమయంలో డ్రైవర్లు యూనిఫాంధరించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

పార్కుల నిర్మాణానికి సహకరించండి



ఏలూరులో ఈడా చైర్మన్ ఈశ్వరి బలరామ్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే దిశగా పార్కుల నిర్మాణానికి సహకరించాలని ఈడా చైర్మన్ ఈశ్వరి బలరాంను జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి కోరారు. శనివారం ఏలూరులో ఈడా చైర్మన్‌ను ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాల ఆధ్వర్యంలో బత్తిన లక్ష్మి మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధికి సహకరించాలని ఈడా చైర్మన్‌ను కోరారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు డివైడర్, అయ్యప్ప టౌన్‌షిప్‌లోని పార్కు, లక్ష్మి గణపతిపార్కు అభివృద్ధికి ఈడా ఆధ్వర్యంలో నిధులు మంజూరుచేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉగ్గం దుర్గాప్రసాద్, బత్తిన చిన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు

కొల్లేరు రోడ్డు ఆక్రమణపై ఆగ్రహం

ఏలూరు రూరల్ : చేపల చెరువుల యజమానులు కొల్లేరు రోడ్డు ఆక్రమించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం పైడిచింతపాడు సర్పంచ్ తిమోతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముంగర సంజీవ్ కుమార్, పల్లెం ప్రసాద్, బీసీ, ఎస్సీ గ్రామ పెద్దలు పైడిచింతపాడు, కొక్కిరాయిలంక మధ్య రోడ్డులో చేపల చెరువుల యజమానులు కంచె వేయడంపై ప్రశ్నించారు. రోడ్డు ఆక్రమించి కంచె వేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. చెరువులో నీరు రోడ్డుపై నుంచి పారడం వల్ల బురద అవుతోందని లీజుదారులను నిలదీశారు. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొల్లేరు రోడ్డు అభివృద్ధి చేస్తోంటే, కొందరు చెరువుల యజమానులు 10 నుంచి 20 అడుగల మేరకు రోడ్డు ఆక్రమించడం అన్యాయమన్నారు. తక్షణం ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా రామమూర్తి జయంతి



రావుసాహెబ్ పండిత్ జి.రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో దుర్గాభవానీ కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ రావు సాహెబ్‌పండిత జి.రామమూర్తి జయంతిని నిర్వహించారు. శనివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి, రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఓసీలుగా ఉన్న విశ్వబ్రాహ్మణులను బీసీల జాబితాలో చేర్చడంలో రామమూర్తి ముఖ్య భూమిక నిర్వహించారన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పి.త్రిమూర్తులు, టి.వెంకటేశ్వరరావు, ఈ.సూరిబాబు, అధ్యక్షుడు కొడూరి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వేమూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తూరంగి పవన్‌కుమార్, సహాయ కార్యదిర్శ తంగెళ్లపల్లి కృష్ణ, కోశాధికారి ఎస్.భానుప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్య వైఖరి



వృద్ధుడిని చెత్త తరలించే ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై స్థానికులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే... కాకినాడకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు కోరుకొండ రామారావు స్థానిక వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. మతిస్థిమితం లేక కొంతకాలంగా ఒంటిమీద దుస్తులు కూడా ఉంచుకోకుండా వ్యవహరిస్తుండడంతో వృద్ధాశ్రమ నిర్వాహకులు స్థానిక పాత బస్టాండ్‌లో అతడిని వదిలివేశారు. దీంతో అతను ఎండుకు ఎండుతూ, చలికి వణుకుతూ అక్కడే ఉంటున్నాడు. చుట్టుపక్కల వారు అతడికి దుప్పటి కప్పేవారు. పరిస్థితిని గమనించిన మునిసిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి అతడిని సురక్షిత ప్రాంతానికి చేర్చాలని మునిసిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆ వృద్ధుడిని చెత్త తరలించే ట్రాక్టర్‌లో శ్మశానవాటికలో ఉన్న షెల్టర్‌కు తరలిస్తుండగా, గమనించిన చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. చెత్తలో ఉన్న వృద్ధుడు మాట్లాడటంతో అతడిని ట్రాక్టర్ నుంచి దించి పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి నిర్లక్ష వైఖరిపై మండిపడ్డారు. అనంతరం ముప్పిడి అంజి ఆ వృద్ధుడికి దుస్తులు అందజేశారు. ఈలోగా ట్రాక్టర్‌ను అడ్డుకున్న విషయం పోలీసులకు తెలియడంతో పోలీసు సిబ్బంది అక్కడుకు చేరుకున్నారు. దీంతో పోలీసుల సహకారంతో వృద్ధుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.